క్లుప్తంగా

హుండీ కానుకల లెక్కింపు



పాత గుంటూరు: దేవాదాయ శాఖ పరిధిలోని కొత్తపేట జగన్నాథ స్వామి దేవస్థానం, ఆంజనేయ స్వామి దేవస్థానం, లాలాపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలోని హుండీ కానుకలను బుధవారం లెక్కించగా మూడు నెలలకు గాను రూ.8,01,229 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి డి. శ్రీనివాసరావు తెలిపారు. జగన్నాథ స్వామి ఆలయానికి రూ.7241, ఆంజనేయ స్వామి ఆలయానికి రూ.3,34,973, వేంకటేశ్వర స్వామి ఆలయానికి రూ.4,59,015 హుండీలలో భక్తులు కానుకల రూపంలో సమర్పించగా ఆదాయం లభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో యాగ పూర్ణాహుతి



పాత గుంటూరు: ఆర్.అగ్రహారంలోని శ్రీ వాసవి యూత్ ఆధ్వర్యంలో 25వ శ్రీ విజయ గణపతి స్వామి నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం గణపతి హోమం, నవగ్రహ హోమం, యాగ పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం మహా సామ్రాజ్య పట్టాభిషేకం, వసంతోత్సవం, చక్రస్నానం కార్యక్రమాల్లో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ గావించారు. అధ్యక్షుడు తూనుగుంట్ల నాగేశ్వరరావు, కార్యదర్శి పువ్వాడ నాగ వెంకటనారాయణ, కోశాధికారి కాజా శ్యామ్ సుందర్ తదితరులు పర్యవేక్షించారు.

29న ఉచిత మెగా వైద్య శిబిరం

పొన్నూరు: పట్టణంలోని నిడుబ్రోలు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఈ నెల 29న మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రేష్మ తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ ఉచిత వైద్య శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొని 11 రకాల వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఆర్థోపెడిక్, చర్మవ్యాధులు, గ్యాస్ట్రిక్, కంటి సమస్యలు, జనరల్ సర్జన్, ప్రసూతి, గుండె సంబంధిత సమస్యలు, తదితర ఆరోగ్య సమస్యలకు శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పొన్నూరు, మండల ప్రజలు వినియోగించుకోవాలని డాక్టర్ రేష్మ సూచించారు.

పేద ముస్లింలకు అంజుమన్ చేయూత

పొన్నూరు: మీలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిరుపేద ముస్లింల వివాహానికి పలు వస్తువులు, నగదు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంజుమన్ కమిటీ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ (మాము) పాల్గొని మహిళలు ముగ్గురికి రూ.30 వేలు, మరో ఇరువురికి వస్తువులు అందజేశారు. అర్బ న్ సీఐ ఎండీ అల్తాఫ్ హుస్సేన్ పాల్గొని ముస్లిం మహిళలకు ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు సైపుల్లా, కమిటీ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో జిల్లా అధికారుల బృందం పర్యటన

గుంటూరు రూరల్: పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకుని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలని గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య విభాగం డీఈయూ రమేష్ తెలిపారు. బుధవారం ప్రత్తిపాడు మండలం నడింపాలెం, తుమ్మలపాలెం గ్రామాల్లో జిల్లా బృందం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలలో బహిరంగ మలమూత్ర విసర్జన చేయరాదని అవగాహన కల్పించారు. తడి చెత్త, పొడి చెత్త, ఇంకుడు గుంతలు సామూహిక ఇంకుడు గుంతలను పరిశీలించారు. నడింపాలెం, తుమ్మలపాలెం గ్రామ పంచాయతీలను ఉత్తమ గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దే క్రమంలో జిల్లా బృందం పర్యటించటం జరిగిందన్నారు. గ్రామాలను పరిశీలించి దేశ స్థాయిలోనే ఉత్తమ పంచాయతీలుగా తీర్చిదిద్దేందుకు తగిన సూచనలు, సలహాలు సంబంధిత అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామీణ నీటి సరఫరా పారిశుద్ధ్య విభాగపు ఏఈ వినీల్ కుమార్, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్స్ షఫీ, సాయి, స్వచ్ఛ భారత్ ఎంఆర్‌సీ డి.శ్రీనివాస రావు, నడింపాలెం పంచాయతీ కార్యదర్శి ఖాజా, నడింపాలెం, తుమ్మలపాలెం ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ రోహిణి, నాగరాజు, ఐటీసీ ప్రతినిధులు అరుణ, ఉమా మహేశ్వరీ పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని ఎస్ఈబీ అధికారులు అరెస్ట్ చేశారు. పట్టణంలోని మద్యం దుకాణాల్లో సీసాలను కొనుగోలు చేసి తరలిస్తున్నడన్న పక్కా సమాచారంతో ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏబీ చలం, సిబ్బంది బుధవారం అదుపులోకి తీసుకుని సోదా చేయగా అతని వద్ద 10 క్వార్టరు సీసాలు లభించాయి. మూడు కంటే ఎక్కువ సీసాలను కలిగి ఉండకూడదన్న నిబంధనలు ఉండడంతో అతన్ని అరెస్ట్ చేశారు. నిందితుడిని బాపట్ల జిల్లా వేమూరు మండలం జంపనికి చెందిన వ్యక్తిగా గుర్తించారు.

జన్యు కారణం.. అవగాహన లోపం

- జీవితాన్ని దుర్భరం చేసే సికిల్‌సెల్ వ్యాధి
- ఉమ్మడి జిల్లాలో 13 మంది వ్యాధి బాధితులు
- బాధితులకు ప్రభుత్వ ఆర్థికసాయం
- సెప్టెంబర్ సికిల్‌సెల్ వ్యాధి అవగాహన మాసం





సికిల్‌సెల్ వ్యాధి అవగాహన పోస్టర్లు

గుంటూరు మెడికల్: సికిల్‌సెల్ వ్యాధి జన్యుపర కారణాలతో వస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ఈ వ్యాధితో ప్రతి ఏడాది మూడులక్షల మంది పిల్లలు జన్మిస్తున్నారు. ఇప్పటివరకు 100 మిలియన్ల ప్రజలు వ్యాధి బారిన పడ్డారని అంచనా. సికిల్‌సెల్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 1983 నుంచి ప్రతి ఏడాది సెప్టెంబర్ నెలను నేషనల్ సికిల్ సెల్ అవగాహన మాసంగా నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

వ్యాధి ఎలా సోకుతుందంటే....

సికిల్‌సెల్ వ్యాధి జన్యుపర మార్పులతో వస్తోంది. సాధారణంగా ఎర్ర రక్త కణాలు గుండ్రంగా ఉంటాయి. ఇవి శరీరమంతా ప్రయాణిస్తూ శరీరంలోని వివిధ అవయవాలకు ఆక్సిజన్‌ను సరఫరా చేస్తుంటాయి. ఎర్ర రక్త కణాల జీవిత కాలం 120 రోజులు ఉంటుంది. సికిల్‌సెల్ వ్యాధిసోకిన వారికి రక్త కణాలు వంపు తిరిగి కొడవలి ఆకారంలో ఉంటాయి. ఫలితంగా అవి శరీరంలోని రక్తనాళాల లోపలికి చొచ్చుకొని వెళ్లలేక ఇతర భాగాలకు ఆక్సిజన్‌ను తీసుకెళ్లలేవు. ఫలితంగా శరీర భాగాలకు ఆక్సిజన్ సరఫరా జరగక అవయవాలు పనిచేయక చిన్న వయస్సులోనే వ్యాధి సోకిన వారు మరణించే ప్రమాదం ఉంది. ఎక్కువగా గిరిజనప్రాంతాల్లో ఈ వ్యాధి బాధితులు ఉన్నట్లు వైద్య నిపుణులు వెల్లడించారు. రక్తంలోని ఒక జన్యువు సికిల్‌సెల్‌గాను, మరొకటి మామూలుగా ఉంటే వీరిని సికిల్‌సెల్ క్యారీయర్లుగా పేర్కొంటారు. వీరికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉండవు. కానీ వీరికి పుట్టే పిల్లలు తీవ్ర అనారోగ్యంతో జన్మించి చిన్న వయస్సులోనే చనిపోతారు.

వ్యాధి లక్షణాలు...

సికిల్‌సెల్ వ్యాధి సోకిన వారిలో దీర్ఘకాలం కామెర్లు ఉంటాయి. రక్త హీనత ఏర్పడి శరీరం పాలిపోయి ఉంటుంది. కాళ్లు, చేతుల వేళ్ళు వాపుతో వంకర్లు తిరిగిపోయి ఉంటాయి. నీరసం, తిమ్మర్లు, డార్క్ ఐస్, చర్మం ముడతలు ఈవ్యాధి సోకిన వారిలో కనిపిస్తాయి. ఈవ్యాధి పుట్టినప్పటి నుంచి ఉంటుంది. శిశువు ఆరు నెలల వయస్సు వచ్చే వరకు ఎలాంటి లక్షణాలు కనిపించవు. వయస్సు పెరిగే కొద్ది కనిపిస్తాయి. ఆక్సిజన్ సరఫరా సరిగా లేకపోవడంతో శరీరంలో ఏదైనా ఒక భాగంలో తీవ్రమైన నొప్పి కలుగుతోంది. కౌమార దశలో ఉన్నవారు, పెద్దవారు దీర్ఘకాలిక తీవ్ర నొప్పితో బాధపడుతూ ఉంటారు.

జిల్లాలో బాధితులు...

ఉమ్మడి గుంటూరు జిల్లాలో సికిల్‌సెల్ బాధితులు 13 మంది ఉన్నారు. నూజెండ్ల మండలంలో ఇద్దరు, బొల్లాపల్లి మండలాల్లో ముగ్గురు, దాచేపల్లి ఒకరు, గురజాల ఒకరు, ఈపూరు ఒకరు, తాడేపల్లి ఒకరు, గుంటూరు ముగ్గురు, పెదకూరపాడు ఒకరు చొప్పున వ్యాధి బాధితులు ఉన్నారు.

ముందుగా గుర్తించవచ్చు



సికిల్ సెల్ వ్యాధి ఉందా లేదా అనే విషయాన్ని గర్భధారణ సమయంలో లేదా ప్రసూతి సమయంలో నిర్ధారిస్తారు. లోపం గల జన్యువు కలిగిన చరిత్ర ఉంటే పుట్టే బిడ్డకు వ్యాధి వచ్చే అవకాశం ఉంది. కంప్లీట్ బ్లడ్ సెల్, హిమోగ్లోబిన్ ఎలక్ట్రోఫోరోసిస్, యూరిన్ ఎనాలసిస్, చెస్ట్ ఎక్స్‌రే పరీక్షల ద్వారా సికిల్ సెల్ వ్యాధిని నిర్ధారణ చేస్తారు. గర్భం దాల్చిన ప్రతి ఒక్కరూ ముందస్తుగా ఈ పరీక్షలు చేయించుకోవడం మంచిది. సికిల్‌సెల్ క్యారియర్స్‌గా ఉన్నవారికి వివాహాలు చేయకుండా ఉండటం ద్వారా వ్యాధి బాధితులు జన్మించకుండా నివారించవచ్చు.

– డాక్టర్ బూసిరెడ్డి దీప్తిరెడ్డి, స్త్రీ, ప్రసూతి, సంతాన సాఫల్య వైద్య నిపుణురాలు, గుంటూరు

ఉచిత వైద్య సేవలు..



గుంటూరు జీజీహెచ్ డైక్ సెంటర్‌లో సికిల్‌సెల్ వ్యాధి సోకిన చిన్నారులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నాం. బోన్ మ్యారో ఆపరేషన్ చేయించడం ద్వారా వ్యాధిని నివారించవచ్చు. చెన్నై రాయవల్లూరులో పిల్లలకు ఉచితంగా ఈ ఆపరేషన్లు చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి ఆరోగ్య రంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చి పలు ఆరోగ్య పథకాలను ప్రవేశపెట్టారు. దేశంలోనే మొట్టమొదటి సారిగా డాక్టర్ వైఎస్సార్ పెన్షన్ కానుక పథకం ద్వారా సికిల్‌సెల్ వ్యాధి బారిన పడిన వారికి ప్రతినెలా ప్రభుత్వం రూ. 10వేలు పింఛన్ అందజేస్తోంది.

– డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, గుంటూరు డీఎంహెచ్‌ఓ

ఓటరు జాబితా సమగ్ర సర్వేకు సహకరించండి

ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ ఎం.ప్రభాకరరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.ప్రభాకరరెడ్డి

తెనాలి: ఓటర్ల జాబితా ప్రత్యేక సమ్మరీ రివిజనులో భాగంగా ఇంటింటి సమగ్ర సర్వే జరుగుతోందని ఇన్‌ఛార్జి సబ్‌కలెక్టర్ ఎం.ప్రభాకరరెడ్డి చెప్పారు. రాజకీయ పార్టీల నాయకులు తగిన విధంగా సహకారం అందించాలని కోరారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం రాజకీయ పార్టీల ప్రతినిధులతో గుంటూరు ఆర్డీఓ, తెనాలి ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ ఎం.ప్రభాకరరెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో జరుగుతున్న సమగ్ర ఓటరు సర్వేపై మాట్లాడారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఎన్నికలు పారదర్శకంగా జరిగేందుకని ఎన్నికల కమిషన్ ప్రత్యేక రివిజను జరుపుతున్నట్టు చెప్పారు. ఓటర్ల జాబితా సర్వేలో ఇప్పటివరకు వచ్చిన ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను వారికి వివరించారు. సందేహాలుంటే తెలియజేయమని కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి తాడిబోయిన రామయ్య, టీడీపీ ప్రతినిధి కేసన కోటేశ్వరరావు, కాంగ్రెస్ ప్రతినిధి పొన్నూరు నాగసూర్య శశిధరరావు, సీపీఎం నేత కొల్లిపర బాబుప్రసాద్‌లు తమ అభిప్రాయాలను వెల్లడించారు. పలు సూచనలు చేశారు.

వర్సిటీకి అంతర్జాతీయంగా కీర్తి తేవడమే లక్ష్యం

ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ పి.రాజశేఖర్, పక్కన రెక్టార్ పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ బి.కరుణ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి అంతర్జాతీయంగా కీర్తి తేవడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. ఏఎన్‌యూ వీసీగా బాధ్యతలు స్వీకరించి ఏడాది కాలం పూర్తయిన సందర్భంగా యూనివర్సిటీ అధ్యాపక సంఘం బుధవారం అభినందన సభ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ గడిచిన ఏడాది కాలంలో విద్యా విషయక, పరిశోధన, క్రీడా, సాంస్కృతిక రంగాలలో యూనివర్సిటీ కీర్తిని మరింత నుమడింపజేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఎన్నో సంస్కరణలు చేపట్టామన్నారు. రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు, యూనివర్సిటీ అధ్యాపక సంఘం అధ్యక్షుడు డాక్టర్ బి.నాగరాజు వీసీ చేపడుతున్న చర్యలను అభినందించి, పుష్పగుచ్చాలు అందించారు. ఓఎస్‌డీ ఆచార్య కె.సునీత, ప్రిన్సిపాల్స్ ఆచార్య సీహెచ్ స్వరూప రాణి, ఆచార్య గంగాధర్, ఆచార్య ఇ.శ్రీనివాస రెడ్డి, ఆచార్య పి.సిద్దయ్య, వికాస అధ్యక్ష, కార్యదర్శులు అనిల్ కుమార్, శ్రీనివాసరావు, పలువురు అధికారులు, సిబ్బంది, పరిశోధకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు



మాట్లాడుతున్న రాయపాటి శ్రీనివాస్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు జేకేసీ కళాశాల పాలకమండలి అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. జేకేసీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులకు బుధవారం దీక్షారంభ్ పేరుతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళీమోహన్ మాట్లాడుతూ కళాశాలలోని గ్రంథాలయం, ప్రయోగశాలలను విద్యార్థులు సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.నాగేశ్వరరావు కళాశాల చరిత్రను వివరిస్తూ క్రమశిక్షణతో మెలగాల్సిన పద్ధతులను తెలియజేశారు. పరీక్షల నియంత్రణాధికారి ఎస్ఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ పరీక్షల తీరు, తెన్నులను గురించి విద్యార్థులకు వివరించారు. అదే విధంగా ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వంటి పాఠ్యేతర కార్యక్రమాలను గురించి తెలిపారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ పి. గోపీచంద్, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



ఉప్పలపాడు పక్షుల కేంద్రంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పక్షుల చైర్మన్ అనిల్‌కుమార్

పెదకాకాని: పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని పక్షుల కేంద్రం చైర్మన్ పెరుమాళ్ళ అనిల్‌కుమార్ అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని ఉప్పలపాడు పక్షుల కేంద్రంలో చైర్మన్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ దేశ విదేశాల నుంచి పక్షులు ఉప్పలపాడు రావడం మనం అదృష్టంగా భావించాలన్నారు. పక్షులకు ఎటువంటి హాని తలపెట్టకుండా ఉండాలన్నారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఆత్మహత్యాయత్నం చేసిన యువతి మృతి

మంగళగిరి: భర్త వేధింపులు తట్టుకోలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత మృతి చెందిన ఘటన మండలంలోని కురగల్లు గ్రామంలో చోటు చేసుకుంది. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన బత్తుల గౌతమి(26) యర్రబాలేనికి చెందిన దానబోయిన హరికృష్ణతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరి మధ్య వివాదం తలెత్తడంతో ఈ నెల 15వ తేదీన కురగల్లులోని తమ పుట్టింటికి వెళ్లింది. భర్త హరికృష్ణ, కుటుంబ సభ్యులు పంచాయతీ పేరుతో బస్టాండ్ సెంటర్‌లో గౌతమిని ఆమె కుటుంబ సభ్యులను అవమానపరచేలా వ్యవహరించారు. దీంతో మనస్తాపానికి గురయిన గౌతమి ఈనెల 21వ తేదీన పుట్టింటి వద్ద పురుగులు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది.

ఇంట్లో చోరీపై ఫిర్యాదు

గుంటూరు ఈస్ట్: ఇంటి యజమాని బాత్‌రూములో ఉండగా అగంతకుడు బాత్‌రూము తలుపు బయటగడిపెట్టి ఇంట్లో చోరీ చేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చంద్రమౌళినగర్‌లో నివాసం ఉండే కారుమూరి అనురాధ ఇంటి బయట తలుపులు వేయకుండా బాత్‌రూములో స్నానానికి వెళ్లింది. గుర్తుతెలియని అగంతకుడు బాత్‌రూము తలుపు బయట గడియపెట్టి బీరువా తాళాలు తీసి అందులోని రూ. 2.50 లక్షలు విలువ చేసే బంగారు నగలు, నగదు చోరీ చేశాడు. అనురాధ బాత్‌రూము తలుపు రాకపోవడంతో పెద్దగా కేకలు వేయడంతో అపార్టుమెంట్ వాచ్‌మెన్ వచ్చి తలుపు తీశాడు. అనంతరం బీరువా పరిశీలించి చోరీ జరిగినట్లు గుర్తించి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: కులంపేరుతో దూషించిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 159వ సచివాలయంలో కన్వీనర్‌గా పనిచేసే కృపాదానం బుధవారం శివనాగరాజుకాలనీలో ఉండగా, అదే ప్రాంతానికి చెందిన చావ వెంకటేశ్వర్లు కృపాదానం వద్దకు వచ్చాడు. తన రేషన్ కార్డు ఎందుకు రద్దు చేశావంటూ కృపాదానంను కులం పేరుతో దూషించాడు. కృపాదానం బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

ట్విట్టర్‌లో అసభ్యకర పోస్టులపై అరెస్టు

గుంటూరు లీగల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి ఆర్.కె.రోజాపై ట్విట్టర్‌లో అసభ్యకర పోస్టింగ్స్ పెట్టిన పాత గుంటూరులోని అలీనగర్‌కు చెందిన ఉప్పలపంచు అజయ్ దీప్‌ను పాత గుంటూరు పీఎస్ పోలీసులు బుధవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నిందితుడు అంజయ్ దీప్ ప్రైవేటు బ్యాంక్‌లో పర్సనల్ బ్యాంకర్‌గా లక్ష్మీపురంలో పని చేస్తున్నాడు. ఇతను సినీ హీరో, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ అభిమాని. ఈ నెల 23న తన ట్విట్టర్ ఖాతాలో మంత్రి రోజాకు సంబంధించి అసభ్యకర సందేశాలు, ఫొటోలు పోస్టు చేశాడు. దీనిపై స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాత గుంటూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణను ప్రారంభించారు. విచారణలో రాష్ట్ర ముఖ్యమంత్రికి సంబంధించి కొన్ని అసభ్యకర పోస్టింగ్స్ పెట్టినట్లు కనుగొన్నారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి నవ్యశ్రీ రూ.20 వేల వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన అవసరం

సీనియర్ సివిల్ జడ్జి నాగరాజా

మంగళగిరి: పర్యావరణ పరిరక్షణపై ప్రతి పౌరుడికి అవగాహన అవసరమని మంగళగిరి సీనియర్ సివిల్ జడ్జి వై.నాగరాజా అన్నారు. పట్టణంలో కోర్టు ఆవరణలో బుధవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జడ్జి నాగరాజా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ముఖ్యమని, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్‌వీ రామకృష్ణ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. ప్లాస్టిక్ వాడకం వలన పర్యావరణంలో సమతుల్యత దెబ్బతింటుందని హెచ్చరించారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.శ్రీప్రత్యూష మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యర్థాలను డస్ట్‌బిన్‌లో వేయాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే అందరి ఆరోగ్యాలు బాగుంటాయన్నారు. కోర్టు ప్రాంగణాన్ని ఎల్లప్పుడూ శుభ్రతగా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు జె.లెనిన్‌బాబు, బి.నాయుడమ్మ పాల్గొన్నారు.

సైన్ బోర్డుల ఏర్పాటుకు సంయుక్త చర్యలు

నగర కమిషనర్ కీర్తి చేకూరి



అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని విద్యా సంస్థలు, హాస్పిటల్స్ వద్ద సైన్ బోర్డ్స్ ఏర్పాటుకు ట్రాఫిక్, విద్యాశాఖ, జీఎంసీ సంయుక్త చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. బుధవారం కమిషనర్ చాంబర్‌లో రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం కమిషనర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్ సేఫ్టీ కాంగ్రెస్ నిబంధనల మేరకు నగరంలో ట్రాఫిక్ పోలీసు, విద్యా శాఖ, ట్రాన్స్‌పోర్ట్, జీఎంసీ సంయుక్తంగా పలు చర్యలు తీసుకోవాలని, అందులో భాగంగా విద్యా సంస్థలు, హాస్పిటల్స్ వద్ద నో హారన్, నిదానంగా వెళ్లండి అనే సైన్‌బోర్డ్‌లు, అవసరం మేరకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. ప్రధాన జంక్షన్‌ల వద్ద ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ ను ట్రాఫిక్ పోలీసుల సమన్వయంతో జీఎంసీ ఇంజినీరింగ్ విభాగం పర్యవేక్షణ చేయాలని, మరమ్మతులు అవసరమైన వాటి వివరాలు ట్రాఫిక్ పోలీసులు ఇవ్వాలన్నారు. ప్రధాన రహదారుల వెంబడి వాహనదారులకు అసౌకర్యంగా ఉండే హోర్డింగ్స్ లను వెంటనే తొలగించాలన్నారు. ఫుట్‌పాత్‌లు, ప్రధాన జంక్షన్‌ల వద్ద ట్రాఫిక్‌కి అంతరాయం కలిగించే ఆక్రమణలను నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం తొలగిస్తుందని, ట్రాఫిక్ పోలీసులు ప్రణాళిక విభాగానికి సహకరించాలన్నారు. నగరపాలక సంస్థ ఎస్ఈ భాస్కర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్‌ఓ డాక్టర్ భాను ప్రకాష్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ కరీం, డీఈఓ శైలజ, ఆర్అండ్‌బీ డీఈఈ నాగిరెడ్డి, ట్రాఫిక్ సీఐ అక్కేశ్వరరావు, ఈఈలు, ఎంఈఓలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన అవసరం

మండల ప్రత్యేకాధికారి, పరిశ్రమల శాఖ డీడీ సుధాకర్



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి, పరిశ్రమల శాఖ డీడీ సుధాకర్

తాడికొండ: బాల్య వివాహాలపై అవగాహన కలిగి ఉండాలని మండల ప్రత్యేకాధికారి, పరిశ్రమల శాఖ డీడీ సుధాకర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ, క్రాప్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలకు నిర్ణీత వయసు రాకుండా వివాహాలు జరిపించడం ద్వారా పుట్టబోయే బిడ్డ లోపాలతో జన్మించడం, తగిన సామర్థ్యం లేని కారణంగా తల్లికి, బిడ్డకి ప్రాణహాని పొంచి ఉందని చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన వయసు కంటే ముందుగా చిన్నారులకు వివాహం జరిపిస్తే అనర్థాలు వాటికి పడే శిక్షలు వివరించారు. ఎంపీడీఓ అత్తోట దీప్తి మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టేందుకు వివాహ నమోదు ప్రక్రియ, గ్రామ/వార్డు స్థాయి బాల్య వివాహ నిషేధిత పర్యవేక్షణ కమిటీలు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. అనంతరం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించిన పోషకాహార మాసోత్సవంలో భాగంగా తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన ఆహార పదార్థాలను తయారు చేసిన స్టాల్ ను సందర్శించి పలువురిని అభినందించారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ కాకుమాను ప్రసాద్, ఎంఈఓ తెనాలి ఇందిర, ఏపీఎం సాంబశివరావు, డీసీపీఓ దుర్గా భవాని, ప్రొటెక్షన్ ఆఫీసర్ బి.విజయ్ కుమార్, లీగల్ ఆఫీస్ కౌన్సిలర్ బి.వాసంతి, క్రాఫ్ కో ఆర్డినేటర్ వెంకట్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు

రూ.22 లక్షలతో చేపట్టే పనులకు శ్రీకారం



అగ్ని ప్రమాదాల నివారణ పరికరాల ఏర్పాటుకు పూజ చేస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో అగ్ని ప్రమాదాలను నివారించేందుకు భద్రత చర్యలను చేపట్టినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. బుధవారం డాక్టర్ పాదిల ప్రసాద్ బ్లాక్ లోని అండర్ గ్రౌండ్‌లో రూ. 22 లక్షలతో అగ్ని ప్రమాదాల నివారణ కోసం చేయనున్న పనులకు పూజలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు అగ్ని భద్రత పరికరాలను ఏర్పాటు చేశారన్నారు. ప్రమాదాలను తగ్గించడానికి మరమ్మతులు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని, ఎలక్ట్రికల్ ఏఈ దస్తగిరి, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్, ఇంజినీరింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు అవయవదానంపై ర్యాలీ

గుంటూరు జీజీహెచ్‌లో గురువారం ఉదయం 8 గంటలకు అవయవ దానం, ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ బుధవారం తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అవయవ ప్రతిజ్ఞతో పాటు పేర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

దాతల వితరణ

గుంటూరు జీజీహెచ్ అభివృద్ధి కోసం దాతలు ముందుకు రావడం అభినందనీయమని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. నాదెండ్ల రాంబాబు, కుమార్తె వైష్ణవిలు ప్లాస్టిక్ బెడ్స్ కాక్ ట్యాప్‌లు సూపరింటెండెంట్‌కు బుధవారం అందచేశారు. ఆసుపత్రిలో జరుగుతున్న అభివృద్ధి పనులకు తమ వంతు సహకారంగా దాతలు ఈ ట్యాప్‌లను అందచేశారని డాక్టర్ కిరణ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశాసజని, పలువురు నర్సింగ్‌సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వనరుడు గుర్రం జాషువా



మాట్లాడుతున్న జాన్‌బాబు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రజల మధ్య నెలకొన్న సామాజిక అంతరాలను నిర్మూలించి, శ్రామికులను చైతన్యపర్చడంలో గుర్రం జాషువా విశేష కృషి చేశారని జనవిజ్ఞానవేదిక జిల్లా అధ్యక్షుడు టి.జాన్‌బాబు పేర్కొన్నారు. కొత్తపేటలోని కాసు శాయమ్మ నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో బుధవారం నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతి సందర్భంగా సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జాన్‌బాబు మాట్లాడుతూ ప్రజలు కుల, మతాలుగా విడిపోకుండా విశ్వనరులుగా ఎదగాలని జాషువా కోరుకున్నారని తెలిపారు. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ప్రసాద్ మాట్లాడుతూ సంఘ సంస్కర్తగానే కాకుండా ప్రకృతితో పాటు ప్రణయ కవితలు, దేశభక్తి కవితలు, స్త్రీవాద కవితలను జాషువా రచించారని వివరించారు. సాంస్కృతిక విభాగం కన్వీనర్ ఎస్ఎం సుభానీ మాట్లాడుతూ జాషువా రచనలు స్త్రీలు, శ్రామికులు, వెనుకబడిన కులాల్లో చైతన్యానికి ఉపయోగపడతాయని అన్నారు. ఉపాధ్యాయుడు పి. శ్రీనివాసరావు, సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు

ఐడియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ గోళ్లమూడి రాజసుందర్ బాబు

నెహ్రూనగర్: కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టగా దాన్ని ఆమోదించటం హర్షించదగ్గ విషయమని ఐడియా(ఐడియల్ దళిత్ ఎంప్లాయీస్ అసోసియేషన్) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ గోళ్లమూడి రాజసుందర్ బాబు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం అంకమ్మనగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన మాట మేరకు నేడు వారి సర్వీస్‌లను రెగ్యులరైజ్ చేస్తూ చట్టాన్ని ఆమోదించడంపై కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసే విషయంలో కొన్ని అడ్డంకులు ఉన్నప్పటికీ నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దాదాపు రాష్ట్రంలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న వేలాదిమంది కాంట్రాక్టు ఉద్యోగులకు మేలు చేకూర్చే విధంగా బిల్లు ప్రవేశపెట్టడం అభినందనీయమన్నారు.